# అలవాటు - పొరపాటు

'బ్రతుకు బుగ్గి చేసిన సారా' కథల పోటీలో
ఈ వారం ఎన్నికయిన కథ

## వి.వాణీ మోహన్




**"బేబీని చూడడానికి సాయంత్రం 4 గం॥లకి పెళ్ళివారు వస్తారు. ఓ కారు జనం ఉంటారు, మరి అన్నయ్య సంగతి ఏం చేయడం?" అన్నాడు రమణ.**

**"పిల్లవాడికి చూచాయగా చెప్పాను వదినా. అన్నయ్య తాగుడు అలవాటు గురించి, అందరి ముందు ఏదో తిక్కగా వాగుతాడు లేదా కంపు కొడుతూ వుంటాడు, బాగుండదు కదా" అంటూ నసిగాడు.**

నిజమే, ఏమన్నా కలియబడతాడు. "నా సంపాదన, నా ఇష్టం. నీకు ఇష్టం లేకపోతే పో" లాంటి సంభాషణలు, మాట ఇంకా పెంచితే తిట్లు, ఆ పైన వస్తువులు విసరడం, తనయినా తూలిపడతాడు ఎదుటి వాళ్ళన యినా పడేస్తాడు. ఈ నరకం పదేళ్ళుగా అనుభవిస్తున్న కమల రోజుకో రకంగా మారే హింసని ఎదుర్కొంటూ జీవిస్తోంది. ఇప్పుడు ఏం చేయాలో తోచక దిక్కులు చూసింది. పీకలదాకా తాగి గదిలో పడున్న భర్తని చూసింది. ఇతను తనను 30 సం॥ క్రితం పెళ్ళాడి కాపురం చేసిన రాఘవ? ఎప్పుడు హుషారుగా అందర్నీ నవ్విస్తూ, స్నేహితుల్ని పోగేసి పార్కులని, హోటళ్ళని, సినిమాలనీ తిరిగేవాడు. రెండు చేతులా సంపాదిస్తూ కులాసాగా ఖర్చు పెడుతూ తిరిగే భర్త ఈ తాగుడు వ్యసనంలో ఎలా కూరుకుపోయాడు? సరదాకి మొదలు పెట్టినది అలవాటుగా మారిపోయింది. అలవాటు దురలవాటుగా ఎప్పుడు మారింది? దురలవాటుతో మునిగి దుర్భరమైన జీవితం గడుపుతూ భార్యకి, పిల్లలకి ఎటువంటి దురవస్థ తెచ్చాడు. ఎప్పుడు ఈ ఊబిలో కూరుకుని ఎందరిని దీంట్లోకి లాగాడో తెలియ లేదు. నెమ్మది నెమ్మదిగా అబద్ధాలవల్ల, అప్పుల ముళ్ళ కంచె చుట్టూ బిగిసిపోయింది.

పాకల్లో దూరి కల్లు తాగి, కట్టుకున్నదాన్ని తన్నేవాళ్ళు అలగాజనం, చదువురాని మూర్ఖులు, దుష్టులు అనుకుంటే, చదువుకుని, సంపాదనపరులై ఖరీదైన మద్యం, విదేశీ సరుకు తాగి ఇల్లు, వొళ్ళు గుల్ల చేసుకునే నాగరికులు ఎలాటి జనం?

పది సంవత్సరాల క్రితం కమల మెడలోని మంగళ సూత్రానికున్న బంగారపు గొలుసు తెంపబోయాడు. ఆనాటి ఘర్షణ తర్వాత పడకలు వేరయి పోయాయి. జీవన విధానం వేరయిపోయింది. అతని బ్రతుకు అందింది పట్టుకుపోవడం, అమ్మేసి తాగడం, ఎప్పుడో ఇంటికి వచ్చి ఒళ్ళు తెలియకుండా పడి నిద్రపోవడం, పెడితే తినడం అతని దినచర్య అయింది. చిన్న స్కూల్లో చిన్న క్లాసులకి పాఠాలు చెప్పడం, ఆ స్కూల్లోనే పది ట్యూషన్లు చెప్పి సంసారం నడపడం కమల దినచర్యగా మారింది. తరుచు ఉద్యోగాలు మారే అతని సంపాదన ఏమిటో, ఎంతో తెలియదు. పిల్లలు ఏం చదువుతున్నారన్నది కమలగాని, రాఘవగాని పట్టించుకోక పోయినా ఆ అస్తవ్యస్తపు బ్రతుకులో పిల్లలకి

చదువు అబ్బింది. చిన్న ఉద్యోగాలు చేస్తూ వాళ్ళ పొట్ట వాళ్ళు నింపుకోగల స్థితికి వచ్చారు. వాళ్ళ సంపాదన గురించి రాఘవకి నిజం చెప్పకుండా కొద్దికొద్దిగా ఇంటిమీద అతను చేసిన అప్పు తీరుస్తూ గుట్టుగా కాలం వెళ్ళదీస్తోంది. ఈ స్థితిలో రమణ బేబీకి సంబంధం చూశాడు. పిల్లవాడు బుద్ధిమంతుడు, కష్టం సుఖం తెలిసిన సహృదయుని కొడుకు. భేషజం లేదు. కలిగినవి పెట్టి పిల్లని పంపవచ్చు, ముఖ్యంగా అన్నయ్య అలవాటు తెలిసినవాడు అని ఆశపడుతున్నాను అన్నాడు రమణ.

ఇప్పుడీ మనిషితోనెలా వ్యవహరించడం. ఇంట్లోంచి బైటకు పంపడమా? లేక భగవంతుని మీద భారం వేసి అతను ఎలా ప్రవర్తించినా సహించడమా? వాళ్ళు చీదరించుకోవచ్చు. పెళ్ళి జరక్కపోవచ్చు. తెర వెనుక భాగోతం తెలిసి తెలియనట్టుండడం వేరు. తెర తీసి నగ్నసత్యం నలుగురి ఎదుట కనబడటం వేరు. 'అమ్మా ఎలాగే' అంటున్న బేబీని ఓదార్చింది. తలుపు తోసి లోపలికి వెళ్ళి భర్త పక్కన కూర్చుని కదిపింది. చల్లటి నీళ్ళలో ముంచిన తువ్వాలుతో ముఖం తుడవసాగింది. చటుక్కున కళ్ళు తెరిచి 'ఏమిటి' అన్నాడు తీవ్రంగా.

"ఉష్" అని అతని నోటిమీద వేలుంచింది అప్రయత్నంగా. కర్రల్లా ఎండిపోయిన అతని వేళ్ళు ఆమె చెయ్యి మీద బిగుసుకున్నాయి. "నాది ఒకమాట వినాలి. మనింటికి బంధువులు రాబోతున్నారు. బేబీకి సంబంధం చూశాడు రమణ. మనకి తెలిసినవాళ్ళే. ఒకసారి కలుసుకుని మాట్లాడుకుంటే బాగుంటుందన్నారు. మీరు ఎటూ వెళ్ళకండి. మంచి కాఫీ తెచ్చాను. నెమ్మదిగా లేచి ముఖం కడుక్కుని బట్టలు మార్చుకోండి" అంది నెమ్మదిగా.

ఎన్నో సంవత్సరాల తర్వాత దగ్గరగా కూర్చుని మాట్లాడుతున్న కమలని తోస్తూ "నేను రాను, నన్ను పిలవకు" అని కాఫీ కప్పు ఒక్క తోపు తోశాడు. లేవబోయిన కమలని చెయ్యి పట్టి లాగి ఎదమీద నొక్కి పెట్టాడు. "నువ్వు ఎంతకయినా తెగించగలవే. నాకు తెలియకుండా పెళ్ళి సంబంధం కుదిర్చావా? డబ్బెక్కడిది? ఎలా సంపాదించావ్? ఎవరి దగ్గర పడుకుంటున్నావ్? నీకు మొగుడంటే అసహ్యం. వాడితో సంసారం కంపరం, ఇప్పుడెందుకే ఈ మొగుడు? ఆ!" అంటూ రొప్పసాగాడు. ఈ అభియోగానికి కమల నివ్వెరపోయింది. విసురుగా పట్టు విదిలించుకుని, కోపం దుఃఖం కలిసి జీరబోయిన గొంతుతో అంది, "ఈ స్థితికి కారణం ఎవరు? జానీవాకర్, రాయల్ సెల్యూట్, వాట్ 69 ల నుంచి రమ్ము, రమ్ము నుంచి పాకల్లో అమ్మే పాకెట్లు, నాటు సారాకి 'దిగజారారు. ఈ సీసాల మధ్య మాయమైన నా భర్త మరి కనపడలేదు. రోజూ ఇంటికి వచ్చి రభస చేసే ఈ వ్యక్తి నా భర్త అనిపించడు.. "ఇంట్లో ఉన్నారు నాన్న' అని బేబీ బెంగపడుతోంది. దాని భవిష్యత్తుకి సంబంధించిన విషయం. కుటుంబ గౌరవం మిగిలిందో లేదో తెలీదు. నీ తండ్రివల్ల భయం లేదు. రభస చేయవద్దని నేను చెప్పాను అని బేబీకి మాట ఇచ్చాను. మనిషిలో మానవత్వం పోయి మృగం మిగిలిందని నాకు తెలుసు. కానీ పసిది. దానికి ఆశ ఉంటుంది. దాని తండ్రిగా కాస్సేపు కనపడండి అని చెప్పాలని. దాని బ్రతుకు బండలు కానివ్వకండి. నోరు మెదిపి ఒక్కమాట మాట్లాడినా ఊరుకోను. మీరు ఈ ఇంటి యజమాని కారు అని చెప్పే పరిస్థితి రానివ్వకండి" అంది తీవ్రంగా. ధారగా కారే కన్నీరు తుడుచుకుంటూ గిర్రున తిరిగి వెళ్ళిపోయిన కమలలోని కాళిక రూపం చూసిన రాఘవకి నిషా పూర్తిగా దిగిపోయింది.

ఎండిపోయిన శరీరం, కళ్ళకింద నల్లటి వలయాలు అతని వయసు రెట్టింపు చేశాయి. హాలులో మాటల సందడి బంధువుల రాక చెప్పింది. పళ్ళాలలోని ఫలహారాలు, పళ్ళు చూస్తూ రమణ భుజం ఆప్యాయంగా నొక్కి అందరికీ షేక్ హేండ్ ఇచ్చి కూర్చున్నాడు రాఘవ. కమల ముఖంలో ఆందోళన ఓరకంట చూశాడు. కులాసా కబుర్ల మధ్య కూతురు, కొడుకు మంచి ఉద్యోగాలే చేస్తున్నారని తెలుసుకున్నాడు. బేబీ అందరితో సంతోషంగా మెలగడం చూశాడు. మనసులో ఎక్కడో చిన్న మూలుగు వినిపించింది. కళ్ళుతడి అవుతున్నాయి. చటుక్కున అన్నాడు, "బాబూ 30 సంవత్సరాల క్రితం నేనూ నీలాగే నా జీవితం పంచుకోబోయే అమ్మాయిని చూశాను. ఆనందంగానే బ్రతికాం. ఎప్పుడో ఎక్కడో అపశృతి పలికింది. స్నేహితులతో సరదాగా మొదలు పెట్టినది అలవాటు అయి, అవసరం అయింది. అదే నాశనానికి దారి తీసింది. మీరు సరదాలు సరదాలుగానే ఉండనివ్వండి. అవసరాలు చేసుకోకండి. నువ్వు బుద్ధిమంతుడవని విన్నాను. జారుడు మొదలయితే తెలియకుండానే ఊబిలో దిగబడిపోతాము. దానికి నేనే ఉదాహరణ. మీకు అభ్యంతరం లేకపోతే రిజిష్టర్ మ్యారేజి చేసుకోండి. నేను పీటలమీద కూర్చుని కన్యాదానం చేసే స్థితిలో ఉంటానో లేదో, నా భార్యని మరింత కించపరచలేను. భగవంతుడు మీకు సర్వసుఖాలు సంతోషాలు ఇవ్వాలి" అని బేబీ తల నిమిరి, వీధిలోకి వెళ్ళిపోయాడు రాఘవ. ✻

**ఈ రచయితకు బహుమతి సొమ్ము త్వరలోనే అందజేయబడుతుంది.**
**- ఎడిటర్**

